క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక


పార్టీలో చేరుతున్న యువకులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి గ్రామంలో శనివారం 100 మంది యువకులు బీజేపీ నుంచి టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు ఆయన మాట్లడుతూ రాబోయే ఎన్నికల్లో కోరుట్ల నియోజకవర్గంలో పార్టీ జెండాను ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరేందుకు అనేక మంది యువకులు ముందుకు వస్తున్నారని తెలిపారు. పార్టీ నాయకులు బైండ్ల శ్రీకాంత్, టీపీసీసీ రాష్ట్ర ఫిషర్‌మెన్ ప్రధాన కార్యదర్శి నారాయణ, ఉమ్మడి జిల్లా మత్స్యకార్మిక డైరెక్టర్ కల్లెడ గంగాధర్, యువకులు పాల్గొన్నారు.

యువత సన్మార్గాన్ని ఎంచుకోవాలి


మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్ రాజు

కోరుట్ల: యువత సన్మార్గాన్ని ఎంచుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని, పెడదారి పట్టవద్దని సీఐ రాజశేఖర్‌రాజు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని పీఆర్‌బీఎం జూనియర్ కళాశాల వార్షిక వేడుకలు స్థానిక పీబీ గార్డెన్‌లో జరిగాయి. ఈ కార్యక్రమానికి సీఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కళాశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ కుమార్, పాఠశాలల కరస్పాండెంట్లు ఎక్కల్‌దేవి బాలాజీ దామోదర్, బండి మహదేవ్, ఎంఏ బారి, డైరెక్టర్లు బి.గంగారెడ్డి, కృష్ణప్రసాద్, పోతని నవీన్ పాల్గొన్నారు.

బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన


రాయికల్: మండలంలోని భూపతిపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శనివారం బాలల హక్కులు, చట్టాలపై మహిళా శిశు సంక్షేమ మోటివేటర్ సురేశ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కావొద్దని, ముఖ్యంగా సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలన్నారు. హెచ్‌ఎం లక్ష్మయ్య, ఉపాధ్యాయులు శంకరయ్య, గిరిధర్, గంగాధర్, మహేశ్, కార్తీక్, తిరుమల, పీఈటీ బందెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాబృందం ప్రదర్శన


సాంస్కృతిక బృందం ప్రదర్శన

బుగ్గారం: రాష్ట్రం ప్రభుత్వం అమలు చేస్తున్న పలురకాల ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజల్లో చైతన్యం కలిగించడమే ధ్యేయంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు బుగ్గారం మండల కేంద్రంలో శనివారం కళాప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంటి వెలుగు, రైతుబంధు, షాదీముబారక్, కల్యాణలక్ష్మి, మిషన్ భగీరథ వంటి పలు కార్యక్రమాలు, అభివృద్ధి పనుల గురించి పాటలు పాడారు. సర్పంచ్ మూల సుమలత, వైస్ ఎంపీపీ సుచేందర్, కళాకారులు మల్లిక్‌తేజ, రాజేందర్, ప్రవీణ్, మురళి, లింగం శ్రీనివాస్, అశోక్, పోచయ్య, శ్రీకాంత్, సురేశ్, అర్చన, రమ్య, రాజేశ్వరి పాల్గొన్నారు.

రాఘవపేటవాసికి డాక్టరేట్



డాక్టరేట్‌తో శ్రీనివాస్

మల్లాపూర్: తమిళనాడులోని హంటి గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నుంచి సామాజిక సేవల విభాగంలో మండలంలోని రాఘవపేటకి చెందిన మెండె శ్రీనివాస్‌ను శనివారం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించారు. మెండె శ్రీనివాస్ చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు సాహిత్య రంగంలో చేసిన విశేష కృషికి డాక్టరేట్‌ను అందుకున్నారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

మల్లాపూర్: మహిళల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి అన్నారు. ఈ మేరకు ఆమె శనివారం మండలంలోని గుండంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన గర్భిణులకు సీమంతం, పౌష్టికాహారం పంపిణీ, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. సర్పంచ్ దనరేకుల మల్లు, ఎంపీటీసీ మామిడి మంజుల, ఉపసర్పంచ్ వేణు, కార్యదర్శి నారాయణరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ సరిత, ఏఎన్‌ఎం పద్మ, హేమలత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సాహిత్యసేవలో దామోదర్

- అక్షర సాహిత్య కళాపీఠం ద్వారా భాషా సాహిత్యసేవ
- సాహితీ సుమాలు ప్రక్రియతో కొత్త కవులకు ప్రోత్సాహం
- తెలుగు భాషా సంస్కృతి సంరక్షణకు కృషిచేస్తున్న ప్రభుత్వ టీచర్
- అక్షర తెలుగు ఛానల్‌తో సృజనాత్మకత కార్యక్రమాలు

కోరుట్లటౌన్: 'భాషా సాహిత్య సేవ భగవంతుని సన్నిధికి తోవ.. సమాజ చైతన్యానికి సాహిత్యమే ఆయువు పట్టు' అంటూ సామాజిక వికాసం కోసం నిరంతరం తన రచనలతోపాటు 100 మంది కవులతో 'సాహితీ కుసుమాలు' అనే కొత్త ప్రక్రియను కవి అంకం దామోదర్ అక్షర సాహిత్య కళాపీఠం సంస్థ ద్వారా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ప్రవృత్తిగా 'తొలకరి జల్లు' పల్లె పరిమళాలు పుస్తక రచన చేయగా, సినీ కవి సుద్దాల అశోక్ తేజ ఆవిష్కరించారు. సమాజంలో సాహితీ తెలుగు వైభవం తెలిసేందుకు విద్యార్థులతో నాటికలు, ప్రసంగాలు చేయిస్తూ ప్రోత్సహిస్తున్నారు.


కవి సమ్మేళనంలో పురస్కారం అందుకుంటున్న దామోదర్

బాల్యం-చదువు..


దసరా కళా పురస్కారంతో అంకం దామోదర్

- మల్లాపూర్ మండలం సాతారంలో అంకం దామోదర్ పల్లె వాతావరణంలో పెరిగి ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి పూర్తి చేశారు. కోరుట్ల పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి, పీఆర్‌బీఎం ప్రైవేటు విద్యాసంస్థలో ఇంటర్, నిజామాబాద్ గిరిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదివారు. కాకతీయ యూనివర్సిటీ అనుబంధ కళాశాల జనగామలోని ఏకశిల కళాశాలలో బీఈడీ పూర్తి చేశారు. 2002లో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగం సాధించారు.

నిరంతర ప్రేరణ కలిగిస్తూ..

- అక్షర సాహిత్య కళాపీఠం స్థాపన..తెలుగు భాషా సంరక్షణ, సాహిత్య వైభవం, సామాజిక వికాసం లక్ష్యంగా 2019లో కోరుట్ల పట్టణంలో అంకం దామోదర్ కవి అక్షర సాహిత్య కళాపీఠం స్థాపించారు. కవులు, కళాకారులకు నిరంతర ప్రేరణ కలిగిస్తూ తెలుగు వెలుగు వైభవం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు.

పుస్తకాలు ఆవిష్కరణ..

1) తొలకరి జల్లు (గేయ సంపుటి) సినీకవి సుద్దాల అశోక్‌తేజ
2) పుష్ప విలాసం (బతుకమ్మ సాహిత్యం) అముద్రితం
3) ఆధ్యాత్మిక అమృతాలు (అముద్రితం)
4) పల్లెటూరి పిల్ల మల్లెపూల గుల్ల ఆడియో ఆల్బమ్ ఆవిష్కరణ

అవార్డులు-పురస్కారాలు

1) గ్రామీణ కళాజ్యోతి అవార్డు
2) అలిశెట్టి ప్రభాకర్ పురస్కారం
3) తెలుగు మహాసభల్లో ప్రశంసాపత్రం
4)కవిరత్న పురస్కారం
5) రాష్ట్రస్థాయి కాళోజీ పురస్కారం
6)యువజన సంఘాల సమితి కళా పురస్కార్ అవార్డు

కవులు, కళాకారులకు ప్రోత్సాహం



ప్రపంచ స్థాయిలో తెలుగు సాహిత్య రచనలకు అక్షర సాహితి కళాపీఠం ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తుంది. కవులను, కళాకారులకు ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తుంది.

– అంకం దామోదర్, కవి, ప్రభుత్వ టీచర్, అక్షర సాహిత్య కళాపీఠం వ్యవస్థాపకుడు

పన్నెండున్నర దాటితే డ్యూటీలో ఒక్కరే

- సమయపాలన పాటించని వైద్యులు
- ప్రైవేటు ఆస్పత్రులపై మొగ్గు
- పట్టించుకోని జిల్లా వైద్యవిధాన పరిషత్ అధికారులు


ఖాళీగా ఉన్న పిల్లల వైద్య నిపుణుల గది

రాయికల్: పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాలకు చెందిన నిరుపేదలకు వైద్యసేవలు అందించేందుకు గాను రాయికల్‌లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను వైద్య విధాన పరిషత్‌లోకి మార్చారు. అయితే వైద్య విధాన పరిషత్‌లోని వైద్యుల పనితీరు మాత్రం మారడం లేదు. నిరుపేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు గాను ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు అందుబాటులో ఉండాల్సిన వైద్యులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.20లోపే అలా వచ్చి ఇలా వెళ్తున్నారు. 12.30 గంటలు దాటితే కేవలం డ్యూటీ డాక్టర్ మాత్రమే దిక్కవుతున్నారు.

సమయపాలన పాటించని వైద్యులు..

రాయికల్ వైద్యవిధాన పరిషత్‌లో పనిచేస్తున్న వైద్యులు సమయపాలన పాటించడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం మధ్యాహ్నం 12.10 నుంచి 12.30 గంటల వరకు 'సాక్షి' విజిట్ చేయగా విధుల్లో ఉండాల్సిన డాక్టర్ ఒడ్నాల రజిత మధ్యాహ్నం 12.15కు, డాక్టర్ హర్షిత, వాణి 12.20కే ఆస్పత్రి నుంచి వెళ్లిపోయారు. పర్యవేక్షించాల్సిన సూపరింటెండెంట్ రవి జగిత్యాలకు ఆస్పత్రి పని నిమిత్తం వెళ్లినట్లు తెలిపారు. కాగా డాక్టర్ తేజస్విని, డాక్టర్ సురేందర్, డాక్టర్ హరిత సెలవులో ఉన్నారని సూపరింటెండెంట్ తెలిపారు.

ప్రైవేటు ఆస్పత్రుల వైపే మొగ్గు..

నిరుపేదలకు వైద్యసేవలు అందించేందుకు గాను విధుల్లోకి వచ్చిన వైద్యులంతా వైద్యవిధాన పరిషత్‌లో తూతూమంత్రంగా సేవలందిస్తూ జగిత్యాల, కోరుట్లలో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి ప్రైవేటు దవాఖానా నడిపించుకుంటున్నారని స్థానికంగా ఆరోపణలు వినవస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన జిల్లా వైద్యవిధాన పరిషత్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పట్టణ, మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాయికల్ ఆస్పత్రిలో వైద్యులు సమయపాలన పాటించేలా చూడాలని పట్టణ, మండల ప్రజలు కోరుతున్నారు.

డ్యూటీ డాక్టర్ మాత్రమే ఉన్నారు



నాకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మధ్యాహ్నం 12.20 గంటలకు నా పెనిమిటి వెంకటేశ్‌తో కలిసి ఆస్పత్రికి వచ్చాం. ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ మాత్రమే ఉన్నారు. మిగతా డాక్టర్లు ఎవరూ లేకపోవడంతో ఉన్న డాక్టర్ వద్ద వైద్యం చేయించుకుని వెళ్లిపోతున్నాం. డాక్టర్లు సమయపాలన పాటించాలి.

– విద్య, కొత్తపేట, రాయికల్ మండలం

వైద్యులపై చర్యలు తీసుకుంటాం



రాయికల్ వైద్య విధాన పరిషత్‌లో సమయపాలన పాటించని వైద్యులపై చర్యలు తీసుకుంటాం. తప్పనిసరిగా వైద్యులు 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వహించాలి. రాయికల్ ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శిస్తాను. సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకుంటాం.

– సుదక్షిణదేవి, జిల్లా వైద్యవిధాన పరిషత్ అధికారి

సంక్షిప్త వార్తలు

✦నేడు గ్రామాల్లో జాతర ఉత్సవాలు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో శ్రీవేంకటేశ్వరస్వామి జాతర, పోతారంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర, భూషణరావుపేటలో మల్లిఖార్జునస్వామి జాతర ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు తెలిపారు.

✦ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

ఇబ్రహీంపట్నం: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును వచ్చే పార్లమెంట్ సమావేశంలో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎంఎస్పీ కోరుట్ల నియోజకవర్గ కన్వీనర్ దయ్యాల హన్మంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంపై మరో యుద్ధానికి సంసిద్ధం చేయడం కోసం, భవిష్యత్ కార్యాచరణకై ఎన్ఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లాస్థాయి కార్యవర్గ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

✦భాషా పండితులకు పదోన్నతి కల్పించాలి

మెట్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతి కల్పించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని మండల పరిషత్ పార్కులో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రత్యేక ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చి ప్రభుత్వం స్కూల్ అసిస్టెంట్ హోదా కల్పించాలన్నారు. జేఏసీ నాయకులు అల్లకట్టు సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్, స్వామి, జ్ఞానేశ్వర్, జ్యోతి, శ్రీనివాస్ ఉన్నారు.

✦పండ్లపై అవగాహన

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని జ్యోతి బిల్డింగ్ బ్లాక్స్ ప్లే స్కూల్ పేరిట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏ పళ్లలో ఎలాంటి విటమిన్స్, ప్రొటీన్స్ ఉంటాయో వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు హరిచరణ్‌రావు పాల్గొన్నారు.

✦అద్దె ట్రాక్టర్‌తో అదనపు ఆదాయం

కథలాపూర్: మండల మహిళా సమాఖ్య తరఫున ట్రాక్టర్, వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేసి అద్దెకు ఇవ్వడంతో అదనపు ఆదాయం సమకూరుతుందని ఎంపీపీ జవ్వాజి రేవతి అన్నారు. ఈ మేరకు శనివారం మండలకేంద్రంలో సెర్ప్ కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య ఏర్పాటు చేసిన కస్టం హైరింగ్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. డీపీఎం వెంకటేశ్వర్, ఎంపీవో గంగాధర్, ఏపీఎం నరహరి పాల్గొన్నారు.

✦ఉచిత దంతవైద్య శిబిరం

కోరుట్లరూరల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో కోరుట్ల సేవాదళ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్.సిరికొండ శ్రీనివాస్ గ్రామస్తులకు దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ తోట శారద, ఉపసర్పంచ్ ముస్తఫా, సేవాదళ్ అధ్యక్షుడు పుప్పాల నాగరాజు, ఉపాధ్యక్షుడు వెగ్యారపు అభిషేక్, సహాయ కార్యదర్శి సోహైల్ పాల్గొన్నారు.

✦పాజిటివ్ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

బుగ్గారం(ధర్మపురి): ప్రతి విద్యార్థి సానుకూలంగా ఆలోచించడం అలవర్చుకోవాలని, మంచి ఆలోచనలతోనే శరీరంలో చర్యలు ఏర్పడుతాయని ఇంపాక్ట్ శిక్షకుడు ధర్మపురికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు రేణిగుంట రమేశ్ అన్నారు. ఈ మేరకు ధర్మపురి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ బాబు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనృసింహస్వామికి వసంతోత్సవం



సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి ఉత్సవమూర్తులకు అర్చకులు వసంతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం యాగశాలలో హోమం కార్యక్రమం జరిగింది. ఆలయ మాజీ చైర్మన్లు గొడుగు కేశవులు, భైరవేని ఆంజనేయులు, అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోష్, చిన్న సంతోష్, మధుకుమారచార్యులు పాల్గొన్నారు.

కొల్వాయి పొలాలకు చేరిన సాగునీరు


జేసీబీతో తూము పూడ్చివేత

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామ రైతులకు ఎట్టకేలకు సాగునీరు చేరింది. తుంగూర్ గ్రామ శివారుల్లోని శాకస ముద్రం వద్ద నూతనంగా నిర్మించిన తూము నాణ్యత లోపంతో నాలుగు రోజుల క్రితం కొట్టుకుపోవడంతో రోల్లవాగు ప్రాజెక్టు కింద 2ఎల్ ద్వారా చేరాల్సిన నీరు చేరలేదు. కాగా శనివారం ఇంజనీరింగ్ అధికారులు, రైతులు, నాయకులు జేసీబీతో పాటు, నాలుగు ట్రాక్టర్లను సమకూర్చి దాదాపు 7 కిలోమీటర్ల దూరం నుంచి రాయిని తీసుకొచ్చి తెగిపోయిన చోట పూర్తిగా పూడ్చివేశారు. దీంతో కొల్వాయి గ్రామ రైతులకు రోల్లవాగు నీరు చేరడానికి మార్గం సుగమమైంది.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీయాక్ట్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: తరచూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ ఆదేశించారు. ఈ మేరకు శనివారం జిల్లా ఎస్పీలతో, పోలీస్ కమిషనర్లతో గ్రేవ్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్, పీడీ యాక్ట్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీడీ యాక్ట్ ప్రకారం నిర్ణీత కాలవ్యవధిలో ఒకే తరహా నేరాలు, శాంతిభద్రలకు విఘాతం కలిగించే వారిని గుర్తించాలన్నారు. పీడీ యాక్ట్ చట్టాన్ని నిందితులు హైకోర్టులో సవాలు చేసే అవకాశం ఉంటుందని, దానికి అనుకూలంగా సరైన ఆధారాలతో పీడీ యాక్ట్ నమోదు చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ భాస్కర్, డీఎస్పీలు రామాంజనేయులు, ప్రకాష్, రవీంద్ర రెడ్డి, సీఐలు శ్రీనివాస్, మల్లయ్య, రాజశేఖర్‌రాజు, కిషోర్, కొటేశ్వర్, రమణమూర్తి, సరిలాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన


బడిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీచైర్‌పర్సన్

జగిత్యాలరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన కోసం మన ఊరు.. మన బడి కార్యక్రమం చేపట్టామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. సంగంపల్లిలో మన ఊరు.. మనబడి కింద రూ.21లక్షలు వెచ్చించి అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాలను వారు శనివారం ప్రారంభించారు. సర్పంచులు మల్లవ్వ, రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవిబాబు, ఎంఈవో గాయత్రి, ఏవో రాజమల్లయ్య పాల్గొన్నారు. అనంతరం గొల్లపల్లెలో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రారంభించారు. సర్పంచ్ ప్రకాశ్, హెచ్‌సీఏ జిల్లా సభ్యుడు సురేశ్, నాయకులు ఆనందరావు, సదాశివరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పాఠశాలల ఆధునీకరణకు సీఎం కృషి

జగిత్యాల: పాఠశాలల ఆధునీకరణకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం మన బస్తీ-మన బడి కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని పోర్టు హైస్కూల్‌లో రూ.22లక్షలతో ఆధునీకరణ పనులను ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్, పర్వీన సుల్తానా పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం

సారంగాపూర్: అభివృద్ధి, సంక్షేమం రాష్ట్రంలో సమానంగా కొనసాగించడమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో పలు కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ధర్మనాయక్‌తండాలో రూ.10లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. అనంతరం సారంగాపూర్‌లో 35 మందికి కల్యాణలక్ష్మి, 39 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. బీర్‌పూర్‌లో 20 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. బీర్‌పూర్ జూనియర్ కళాశాలలో రాగిజావ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీపీలు కోల జమున, మసర్తి రమేశ్, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, సారంగాపూర్, బీర్‌పూర్ సర్పంచ్‌ల ఫోరం, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు గుర్రాల రాజేందర్‌రెడ్డి, నల్ల మహిపాల్‌రెడ్డి, జోగినపల్లి సుధాకర్‌రావు, సర్పంచ్‌లు శిల్ప, సంతోష్, వైస్‌ఎంపీపీ సురేందర్, విండో చైర్మన్లు నర్సింహారెడ్డి, మాజీ జెడ్పీటీసీలు రమణ, శంకర్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు


ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో ప్రజలు

మల్లాపూర్: మండలంలోని రత్నాపూర్ శ్రీమల్లికార్జునస్వామి జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం సంగెం-శ్రీరాంపూర్‌లో స్వామివారి ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. రత్నాపూర్ మల్లికార్జున స్వామికి సంగెం-శ్రీరాంపూర్ సర్పంచ్ పాలెపు దిలీప్, గ్రామస్తులు, మహిళలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు కుడకల శివకుమార్‌స్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, పల్లకిసేవ, ఒగ్గుకథలను వైభవంగా నిర్వహించారు. హిందూ యువసేన సభ్యులు మోర్తాడ్ సాయన్న, సాయికుమార్, రజనీకాంత్, మహేందర్, ప్రమోద్, ముకేష్, వెంకటేశ్, సాజన్, ఆరె శ్రీనివాస్, జంగం శేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మెట్‌పల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని కాంగ్రెస్ సేవాదళ్ ఉత్తర తెలంగాణ అధ్యక్షుడు ముస్తాక్ సూచించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమానికి సంబంధించిన స్టిక్కర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతోందని, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేంద్ర, రాష్ట్రాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించాలన్నారు. నాయకులు జువ్వాడి కృష్ణారావు, మన్సూర్, మహేందర్‌రెడ్డి, లింగం, అంజిరెడ్డి, లింగారెడ్డి, అందె మారుతి ఉన్నారు.

పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

సారంగాపూర్: రోల్లవాగు ప్రాజెక్టు తెగిపోవడంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని వంచిత్ బహుజన్ అఘాడి పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి గవ్వల శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు శనివారం బీర్‌పూర్ మండలం కమ్మునూర్ గ్రామంలో పార్టీ కార్యకర్తల సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రోల్లవాగు ప్రాజెక్టు తెగిపోయి చాలా మంది రైతుల భూముల్లో ఇసుకమేటలు ఏర్పడ్డాయని, వందలాది ఎకరాల్లో పైప్‌లైన్లు, మోటార్లు కొట్టుకుపోయి రైతులు రూ.కోట్లు నష్టపోయారని, ప్రతి ఎకరాకు ప్రభుత్వం రూ.50వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు శేఖర్, వసంత్, మల్లయ్య, భూమయ్య, రామస్వామి ఉన్నారు.

మహిళల భద్రత కోసం షీటీం పనిచేస్తుంది

జగిత్యాలక్రైం: జిల్లాలో మహిళల భద్రత కోసం షీటీం బృందం ప్రత్యేకంగా పనిచేస్తోందని షీటీం ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని గర్ల్స్ హైస్కూల్ ఉర్దూ మీడియంలో షీటీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో మహిళల హక్కులు, రక్షణ కోసం షీటీం ప్రత్యేకంగా పనిచేస్తుందన్నారు. ఏఎస్సై వలీబేగ్, మహిళా కానిస్టేబుళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు పెగడపల్లిలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పాదయాత్ర

పెగడపల్లి: బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ తలపెట్టిన బహుజన రాజ్యాధికార పాదయాత్ర 5న ఆదివారం పెగడపల్లి మండలానికి చేరుకుంటుందని ఆ పార్టీ ధర్మపురి నియోజకవర్గం ఇన్‌చార్జి నక్క విజయ్‌కుమార్ శనివారం తెలిపారు.

కార్మికుల హక్కుల కోసం శ్రమించాలి


మాట్లాడుతున్న వెన్న సురేశ్

జగిత్యాల: కార్మికుల హక్కుల కోసం అందరూ శ్రమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేశ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన కార్యాలయంలో మాట్లాడారు. మగ్దుం మొహినోద్దీన్ తెలంగాణ సాయుధ పోరాట వీరుడని, సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన వ్యక్తి అని, కార్మికుల కోసం పోరాటం చేశారని కొనియాడారు. శ్రీనివాస్, రాజు, రమేశ్, దేవదాసు, విజయ్ పాల్గొన్నారు.